# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :138 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 26-07-2024 | పేజీలు:4 వెల: 2.00


## 26న నీతి ఆయోగ్ భేటీ... హాజరుకానున్న చంద్రబాబు

న్యూఢిల్లీ : ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఏపి సిఎం చంద్రబాబు హాజరుకానున్నారు.. ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆయన తొలిసారిగా ఈ మీటింగ్ లో పాల్గొననున్నారు.. ఇక చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే కేంద్ర బడ్జెట్ లో భారీగా ఎపికి నిధుల రాబట్టిన ఆయన తాజా ఢిల్లీ పర్యటనలో గే ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుస్తారని సమాచారం. మరికొన్ని ప్రాజక్ట్ లకు గ్రీన్ సిగ్నల్ పొందేందుకు ఆయన ఈ పర్యటనను వినియోగించుకోనున్నారు.

## 2.91లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్.. వ్యవసాయానికి 72 వేల కోట్లు



హైదరాబాద్: తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను (తెలంగాణ బడ్జెట్) ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో ఖర్చు రూ.2,20,945 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ప్రతిపాదించారు. సంక్షేమం, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిన అంశాలు.మెట్రో వాటర్ వర్క్సుకు రూ.3,385 కోట్లు, నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు రూ.200 కోట్లు, జీహెచ్‌సీలో మౌలిక వసతులు కల్పనకు రూ.3,065 కోట్లు, హెచ్ఎండీఏలో మౌలిక వసకల్పనకు రూ.500 కోట్లు, వ్యవసాయకు రూ.72,65 కోట్లు క శాఖకు రూ .1,980 కోట్లు కేటాయించారు. ఇక రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం రూ.723 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,418 కోట్లు ప్రతిపాదించారు.

జీహెచ్‌సీ పరిధిలో కేటాయింపులు ఇలా..

-మెట్రో వాటర్ వర్క్స్- రూ.3,385 కోట్లు
- హైడ్రా సంస్థ- రూ.200 కోట్లు
-జీహెచ్‌సిలో కల్‌ప్రాథమిక వసతులు- రూ.3,065 కోట్లు
-హెచ్ఎండీఏలో ప్రాథమిక వసతుల కల్పన- రూ.500 కోట్లు
-విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణ- రూ.100 కోట్లు
- హైదరాబాద్ నగర అభివృద్ధికి- రూ10 వేల కోట్లు
- మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు- రూ.1500 కోట్లు
-ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు- రూ1525 కోట్లు
-పాతబస్తీ మెట్రో విస్తరణకు- రూ.500 కోట్లు
-మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్- రూ.50 కోట్లు
-ఔటర్ రింగ్ రోడ్డుకు- రూ.200 కోట్లు
- హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు- రూ.500 కోట్లు

కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ పొద్దు రూ. 2.75 ల క్ష ల కోట్లు. పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ఓటాన్ అకౌంట్ కంటే కొంత పెరిగే అవకాశం ఉంది. నాలుగు కాలానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నెలల్లో, జూలై నెలాఖరుతో ఓన్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమయం ముగియనుంది. దీంతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నారు.

దేశం కంటే తెలంగాణ వృద్ధిరేటు అధికం..

హైదరాబాద్: యావత్ దేశం వృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధి రేటు అధికంగా ఉందని ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర, దేశీయ ఉత్పత్తి (%+ూణూ%) ప్రస్తుత ధరల ఆధారంగా లెక్కిస్తే రూ.14,63,963 కోట్లు అని చెప్పారు. అంచనాతో 11.9 శాతం వృద్ధి రేటు నమోదయిందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ వృద్ధిరేటు 9.1 శాతం మాత్రమేనని. తెలంగాణ వార్షిక బడ్జెట్‌ను (తెలంగాణ బడ్జెట్) భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.గత ఆర్థిక సంవత్సరానికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.2 శాతం అభివృద్ధి చెందింది. ఇదే కాలానికి భారత దేశ ఆర్థిక రంగం 7.6 శాతం, తెలంగాణ 7.4 శాతంగా వృద్ధిని నమోదుచేశాయి. అంటే తెలంగాణ వృద్ధిరేటు జాతీయ వృద్ధిరేటు కన్నా తక్కువ అని గమనించాలన్నారు. కాగా, ఆదాయాన్ని మించి రుణం నిరంతరంగా పెరుగుతుంటే తెలంగాణ ఆర్థిక స్వస్థత ప్రమాదంలో పడుతుందని తెలిపారు. దీనిని నిలువరించడానికి కఠోర ఆర్థిక సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. దానిని నివారించాలంటే ఆర్థిక వ్యయాన్ని, ఆదాయాన్ని సమన్వయ పరిచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు..!

హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదారబాద్, అమరావతి వాతావరణ కేంద్రాలు హెచ్చరికలు జారీ చేశాయి. ఇవాళ, రేపు తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో.. మరికొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించిన ప్రకారం.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగామ, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీస్తాయి. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంది. నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయనున్నాయి. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు వరుసగా 28 డిగ్రీలు, 23 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉంది. పశ్చిమ, నైరుతి దిశలో ఉపరితల గాలులు వీస్తాయి. గంటకు 10-12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయనున్నాయి. బుధవారం గరిష్ట ఉష్ణోగ్రత 27.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 23.6 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 85 శాతంగా ఉంది.ఏపీలోని యానాంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. అమరావతి



వాతావరణ కేంద్రం అధికారులు జూలై 24న వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తర కోస్తాలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయి. రాయలసీమలో కూడా ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడనున్నాయి. ఒకటి రెండు చోట్ల గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

## ఖర్చు ఘనం చెత్త పదిలం.. గ్రేటర్‌లో ఎక్కడి వ్యర్థాలు అక్కడే

హైదరాబాద్,గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతోంది. నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దాల్సిన బల్దియా అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యాధుల నివారణకు ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా..లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోతున్నారు. ఇంటింటికీ, పొడి చెత్త సేకరణ, తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు-జీవీపీ) ఎత్తివేతలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.గ్రేటర్ వ్యాప్తంగా చెత్త డబ్బాలను ఎత్తి వేయగా, ఇప్పటికీ 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) ఇటీవల నిర్వహించిన సర్వేలో తేల్చడమే అధికారుల పనితీరును ప్రశ్నిస్తోంది. ఈ నగరంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. బస్తీలు..కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. వివిధ వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చెత్త తరలింపు కేవలం కాగితాల్లో మాత్రమే కనిపిస్తున్నది. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ మొదలుకొని డిప్యూటీ కమిషనర్ల వరకు ఆకస్మిక పర్యటనలు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతోంది.

చెత్త కుప్పలే దర్శనం..

గడిచిన కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా.. పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపుతమన్న లక్ష్యం నీరుగారుతోంది. తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు) జీహెచ్‌సీ పరిధిలో 2640 ప్రాంతాలను గుర్తించి, వాటిని పూర్తి స్థాయిలో ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.కానీ క్షేత్రస్థాయిలో వీటికి అదనంగా కొత్తగా జీవీపీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. ఈ నేపథ్యంలో విజయనే పారిశుధ్యంపై ఫిర్యాదులు అధికం కావడం, ఇటీవల హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేయర్ గద్వాల్‌లక్ష్మి పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగుపడలేదని, తన డివిజన్‌లో చెత్త ఎత్తడం లేదని సంబంధిత అధికారులు తెలిపారు. వాస్తవంగా వర్షాకాలంలో వ్యర్థాలు త్వరగా కుళ్లి దుర్గంధం వెదజల్లే పరిస్థితులు ఎక్కువ. అయితే చెత్తను తరలించేందుకు వర్షాకాలంలో ఏర్పాట్లు చేయడం లేదు. ఇప్పటికే మలేరియా, డెంగీ కేసులు విజృంభిస్తున్నాయి.



పర్యవేక్షణ ఏది?

ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం అమలు కావడం లేదు.గ్రేటర్‌ను చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా దాదాపు మూడున్నరేండ్ల కిందట డస్ట్ బిన్‌లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్‌పీ ఎత్తేసింది. మెరుగైన పారిశుధ్య నిర్వహణను పకడ్బందీ చేస్తూ వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి.ఒకొక ఆటో కాలనీల వారీగా చూస్తే ఒకటి లేదా రెండు కాలనీలు గృహాల ప్రకారం గమనిస్తే ఒక అటోకు సుమారుగా 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛమైన ఆటోల పనితీరు సరిగా లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్‌లో లేదు. రోజూ 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని.. స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్ పేర్కొన్నారు.నేటికీ స్వచ్ఛమైన ఆటోల పనితీరుపై పర్యవేక్షణ లోపించింది. దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతున్నది. సమయ పాలన పట్టించుకోకపోవడం, చెత్త సేకరణలో వసూళ్లకు తెరలేపడం, సిటీలో ఉండాల్సిన స్వచ్ఛ ఆటోలు గ్రేటర్ సరిహద్దులు దాటుతుండటం. ఇదే విషయంపై ఇటీవల కొత్త కమిషనర్ ఆమ్రపాలి సైతం స్వచ్ఛ ఆటోల పనితీరు మెరుగుపర్చాలని, లేదంటే చర్యలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## కేటీఆర్ స్పీడ్ కు రేవంత్ పంచ్.. కేసీఆర్ బుక్ అయ్యారా?



హైదరాబాద్,కొన్ని విషయాల్లో మాజీ మంత్రి కేటీఆర్ దూకుడు.. తొందరపాటు పార్టీకి.. పార్టీ అధినేతకు తిప్పలు తీసుకొచ్చేలా మారిందా? అంటే అవునన్న మాట పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయన వేసే అడుగుల్లో వ్యూహం మిస్ అవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొందరపాటుతో మాట్లాడే మాటలు.. ముంచుకొచ్చే ఇబ్బందిని గుర్తించని వైనం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. తాజాగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేటీఆర్ నోటి నుంచి వచ్చిన మాటను అసరాగా చేసుకొని..సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాలు ఇప్పుడు గులాబీ బాస్ కేసీఆర్ కు కొత్త తలనొప్పిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ ను టార్గెట్ చేసే క్రమంలో ఆయన్ను ఇరుకున పెట్టేందుకు వీలుగా వ్యవహరించిన మాజీ మంత్రి కేటీఆర్ తీరు ఇప్పుడు ఆయనకే ఇబ్బందికరంగా మారింది. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్న అంశంపై జరిగిన చర్చలో భాగంగా మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ ను ఇరుకున పడేసే ప్రయత్నం చేశారు. రాష్ట్రానికి నిధులు కోసం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ తో సహా మంత్రివర్గ సభ్యులంతా ఆమరణ దీక్ష చేయలంటూ సవాలు విసిరారు. వారి దీక్షకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు.నిధులు తెచ్చుడో.. కేబినెట్ సచ్చుడోనని వ్యాఖ్యానించిన కేటీఆర్ మాటలకు తోడుగా మరో మాజీ మంత్రి హరీశ్ రావు కలుగజేసుకొని.. ప్రభుత్వం అఖిల పక్షాన్ని తీసుకొని ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తే బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనూహ్యంగా రియాక్టు అయ్యారు. రాష్ట్ర ప్రయోజనాల నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష చేసేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్.. "చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చానని మేమెప్పుడు అబద్ధాలు చెప్పలేదు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ పది పైసలు పెట్టి అగ్గిపెట్టె కొనలేదని చెప్పలేదు. జంతర్ మంతర్ వద్దకు కేసీఆర్ ను రమ్మనండి. ప్రతిపక్షనాయకుడి హోదాలో ఆయన.. శాసన సభాపక్ష నాయకుడిగా నేను తెలంగాణకు నిధులు తెచ్చుడో.. అవసరమైతే సచ్చుడో తేలుద్దాం" అంటూ ప్రతి సవాలు విసిరారు.సీఎం రేవంత్ నుంచి ఈ తరహా సమాధానం ఉంటుందని ఊహించిన మాజీ మంత్రి కేటీఆర్ సవాలుకు ప్రతిసవాలును స్వీకరించే దానిపై మాట్లాడలేదు. కామ్ గా ఉండిపోయారు. ఇదంతా చూసిన వాళ్లు.. అనటం ఎందుకు? అనిపించుకోవటం ఎందుకు? అన్న మాటతో పాటు.. రేవంత్ ను ఇరుకున పెట్టాలని కేటీఆర్ అనుకున్న ప్రతి సందర్భంలోనూ రివర్సులో ఆయనే ఇబ్బందికి గురవుతున్న అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇప్పటికైనా కేటీఆర్ కాస్తంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే ఇలాంటి భంగపాట్లు ఉండవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## జగన్ కు ఆ రకంగా కలిసొచ్చిందా ఢిల్లీ ధర్నా?!

అమరావతి,వై నాట్ వన్ సెవంటీ ఫైవ్ అంటూ మాజీ సీఎం జగన్ భారీగానే దెబ్బతిన్నారు. మితిమీరిన ఆత్మవిశ్వాసానికి ఏపీ ఓటర్లు బ్రేకులు వేశారు. కనీసం ప్రతిపక్షహోదా కూడా లేకుండా చేశారు. పార్టీ శ్రేణులు నిరాశా నిస్పృహతో ఉన్నారు. జగన్ పని అయిపోయింది. ఇక ఆయన మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని కొందరు తెలుగు తమ్ముళ్లు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. అందుకే రాష్ట్రంలో ఏ పరిస్థితినీ అంత తేలిగ్గా వదులుకోదల్చుకోలేదు జగన్. మొన్నటి రషీద్ హత్యోదంతాన్ని జాతీయ స్థాయికి తీసుకెళదామని అనుకున్నారు జగన్. ఆ మేరకు రాష్ట్రపతికి సైతం లేఖలు రాశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, తమ కార్యకర్తలపై దాడులు జరుపుతున్నారని, హత్యలకు సైతం వెనకాడటం లేదని, టీడీపీ కార్యకర్తలు గుండాలు మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు లేఖలు రాశారు. అదీ చాలదన్నట్లు ఢిల్లీలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టి ఏపీలో శాంతి భద్రతల సమస్యను జాతీయ సమస్యగా చూపిద్దామని అనుకున్నారు జగన్.

ఇండియా కూటమి మద్దతు

జగన్ అనుకున్నది ఒకటైతే అక్కడ జరిగింది మరొకటి. రాష్ట్రంలో టీడీపీతో కలిసి పోటీచేసిన బీజేపీ ఇప్పుడు జగన్ కు ఏ రకంగా మద్దతు ఇస్తుంది. అదే జరిగింది. బీజేపీ నేతలు ఎవరూ కనీసం జగన్ ను పరామర్శించడానికి సైతం వెళ్లలేదు. అయితే మోదీకి వ్యతిరేక కూటమి అయిన ఇండియా కూటమి కి చెందిన ముఖ్య నేతలు మాత్రం జగన్ కు బాగానే మద్దతు ఇచ్చారు. ఎన్నికల ముందు జగన్ కూడా మోదీకే సపోర్టు అనే అనుమానంతో మైనారిటీ ముస్లిం ఓటర్లు జగన్ కు దూరం అయ్యారు. అది కూడా జగన్ ఓటమికి ఓ కారణం అయింది. అయితే ఊహించని రీతిలో తనకు మద్దతునిస్తున్న ఇండియా కూటమి నేతల వైఖరితో జగన్ ఆశ్చర్యపోతున్నారు. ఈ మాత్రం సపోర్టు దొరికితే చాలు ఇక కేంద్రాన్ని ఆడుకోవచ్చని జగన్ ప్లాన్. పైగా ఈ సారి కేంద్రంలో బలమైన ప్రతిపక్షంగా తయారయింది ఇండియా కూటమి.రీసెంట్ గా, దేశవ్యాప్తంగా 13 నియోజకవర్గాలలో జరిగిన ఉప ఎన్నికలలో మోదీ కూటమి కేవలం రెండు స్థానాలకే పరిమితం కాగా పది స్థానాలలో ఇండియా కూటమి జయకేతనం ఎగురవేసింది. భవిష్యత్ లో మోదీకి ప్రత్యామ్నాయం తామే నని చెప్పనట్లయింది. మొన్నటిదాకా ఎటూ తేల్చుకోలేక డైలమాలో పడ్డ జగన్ ఇప్పుడు మైండ్ సెట్ మార్చుకున్నట్లు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



రాష్ట్రంలో కాంగ్రెస్ తో కలసి ప్రయాణం..

ఎలాగూ ఏపీలో వైసీపీకి మద్దతుగా నిలిచే పార్టీ ఒక్కటి కూడా లేదు. ఇండియా కూటమి సహాయ సహకారాలతో ఇకపై జాతీయ స్థాయిలో ఏపీ పై ఉద్యమాలు చేసేందుకు జగన్ సన్నద్ధం అవుతున్నారు. జగన్ ఢిల్లీ ధర్నాలో ఉన్నప్పుడు సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ జగన్ కు సపోర్ట్ గా నిలిచారు. అదే సమయంలో తృణమూల్ అధినేత మమతా బెనర్జీ సైతం జగన్ కు మద్దతు తెలపడం విశేషం . పొరుగు రాష్ట్రం అయిన తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా జగన్ కు మద్దతుగా నిలిచారు. ఇంకా శివసేన నేతలు, ఎంఐఎం నేతలు జగన్ కు సపోర్ట్ గా నిలిచారు. ఏపీలో చంద్రబాబు వ్యూహంతో బీజేపీ, జనసేన కలిసి కూటమిగా పోటీచేసి అత్యధిక మెజారిటీ సాధించుకున్న రీతిలో వచ్చే ఎన్నికలలో తాను కూడా కాంగ్రెస్ కు సపోర్టు చేస్తే మళ్లీ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు, సీనియర్ నేతలు తమ పార్టీకి మద్దతు నిస్తారని ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది.

మొత్తానికి ఫలితం దక్కింది

రాజకీయాలలో ఏదైనా..ఎప్పుడైనా జరగొచ్చు. నిన్న తిట్టుకున్న నేతలే నేడు కలుసుకోవచ్చు శత్రువులు కూడా మిత్రులవ్వవచ్చు. జగన్ కూడా ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి బయటకొచ్చిన నేతే కదా కాబట్టి మరో సారి కాంగ్రెస్ సపోర్టు తీసుకుంటే పార్టీకి లాభమే తప్ప నష్టం లేదని జగన్ భావిస్తున్నాడని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. మొత్తానికి ఢిల్లీ ధర్నా జగన్ కు వ్రతం చెడ్డా..ఫలితం మాత్రం దక్కిందనే చెప్పాలి.

## బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు హిమాచల్ కోర్టు నోటీసులు



సిమ్లా: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ (కంగనా రనౌత్)కు హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మండి నియోజకవర్గం నుంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. తన సమీప ప్రత్యర్థి అయిన విక్రమాధిత్య సింగ్‌పై (కాంగ్రెస్) 74,755 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అయితే ఆ స్థానం నుంచి పోటీ చేయడానికి తాను దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అన్యాయంగా తిరస్కరించారంటూ కిన్నౌర్‌కు చెందిన లాయక్ రామ్ నేగి (లాయక్ రామ్ నేగి) కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రనౌత్ ఎన్నికను పక్కన పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఒప్పందం వచ్చే నెల 21న వివరణ ఇవ్వాలంటూ రణౌత్‌ను న్యాయస్థానం ఆదేశించింది.ఆ శాఖలో పనిచేసిన తాను.. ముందుగానే ఉద్యోగవిరమణ చేసినట్లు నేగి తన వ్యాజ్యంలో చెప్పాడు. నామినేషన్ పత్రాలతో పాటే డిపార్ట్‌మెంట్ నుంచి పొందిన 'నో డ్యూ సర్టిఫికెట్'ను జత చేసింది. కానీ, విద్యుత్తు, తాగునీరు, టెలిఫోన్ విభాగాల నుంచి కూడా సర్టిఫికెట్లు తీసుకురావాలని రిటర్నింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. అందుకు ఒకరోజు గడువులోగా తాను అన్నీ తీసుకెళ్లినట్లు చెప్పారు. వాటిని తీసుకోకపోగా.. తన నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. నామినేషన్ పత్రాలు అంగీకరించి ఉంటే తాను అక్కడి నుంచి గెలిచేవాడినని రామ్ నేగి తన వ్యాజ్యంలో పేర్కొన్నాడు. అందుకే ఈ ఎన్నికను పక్కనపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

# మోదీ సర్కారు తీపి కానుక!

న్యూఢిల్లీ: వివిధ ప్రభుత్వ విభాగాలను, సంస్థలను ఆరెస్సెస్ అనుకూల వాదులతో నింపివేస్తున్నదన్న విమర్శల నేపథ్యంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకున్నది. ఆరెస్సెస్ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనటాన్ని నిషేధిస్తున్న ఉత్తర్వులను ఎత్తివేసింది. దీంతో ఇకపై ప్రభుత్వ ఉద్యోగులు నిరాటంకంగా సంఘ్ కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు మార్గం సుగమం చేసింది. ఈ మేరకు సిబ్బంది వ్యవహారాల శాఖ ఒక ఉత్తర్వు వెలువరించింది. జూలై 9వ తేదీతో ఉన్న ఈ ఉత్తర్వులు దేశంలో రాజకీయంగా తీవ్ర సంచలనం రేపుతున్నాయి. 58 ఏళ్ల క్రితం విధించిన రాజ్యాంగేతర ఉత్తర్వును మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఉపసంహరించిందని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో ధృవీకరించారు.గోవధకు వ్యతరేకంగా 1966 నవంబర్ 7న పార్లమెంటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళన జరిగిందని, ఆరెస్సెస్, జనసంఘ్ అప్పట్లో లక్షల మందిని సమీకరించడంతో వణికిపోయిన అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రభుత్వ సిబ్బంది ఆరెస్సెస్‌లో చేరడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఆరెస్సెస్ నాయకులు బీజేపీ నాయకుల వ్యవహార శైలిపై సూటిగానే పరోక్ష వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. బీజేపీ పనితీరుతో మాతృసంస్థ సంతృప్తిగా లేదనే అభిప్రాయాల ఉన్న నేపథ్యంలో సంఘ్ నేతలను ప్రసన్నం చేసుకునేందుకే ఈ ఉత్తర్వులు ఎత్తివేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి.నిషేధం ఎత్తివేతపై దేశవ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. ఆరెస్సెస్ స్థాపించి 2025 నాటికి వందేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో మోదీ ప్రభుత్వం ఇప్పుడే సంబురాలు ప్రారంభించిందని రచయిత, బ్లాగర్, కవి, రాజకీయ విశ్లేషకుడు రాజు పరులేకర్ పేర్కొన్నారు. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల్లో అనేక మంది ఆరెస్సెస్ సిద్ధాంతాల కోసం బాహాటంగానే పనిచేయచ్చని వ్యాఖ్యానించారు. జీవోలో పేర్కొన్న 'గవర్నమెంట్ సర్వెంట్' అనే పదాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. ఇది మంత్రులకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు.ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లో ఆరెస్సెస్ బ్యానర్లు, పోస్టర్లు, చిహ్నాలు, సాహిత్యం వంటివి దొరుకుతాయని ఎద్దేవా చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకమైన సిద్ధాంతాలు, ఆకాంక్షలు కలిగిన ఆరెస్సెస్‌లో సభ్యులుగా ఉండే గవర్నమెంట్ సర్వెంట్స్.. రాజ్యాంగాన్ని కాపాడుతామని ఎలా ప్రమాణం చేయగలరని ప్రశ్నించారు. ఇప్పుడు ఆరెస్సెస్ సభ్యులను ప్రభుత్వం నేరుగా ఉద్యోగాల్లోకి రిక్రూట్ చేసుకుంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం వ్యవస్థను బీజేపీ హైజాక్ చేయాలని చూస్తున్నదని పలువురు నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. బీజేపీ అసలు ఆట ఇప్పుడే మొదలుకానున్నదా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో స్పందించాయి. ఇక ప్రభుత్వ ఉద్యోగులు నిక్కర్లు వేసుకుని కార్యాలయాలకు రావచ్చని కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. ఉద్యోగులు ఆరెస్సెస్‌లో భాగంగా ఉంటే వారు దేశానికి విశ్వసనీయులుగా ఉండలేరని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ ఆదేశాలు దేశ ఐక్యతకు వ్యతిరేకమని చెప్పారు. 'రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని ఆమోదించనందుకే ఆరెస్సెస్‌ను గతంలో నిషేధించారు. దేశంకంటే హిందూత్వమే తనకు ఎక్కువని ప్రతి ఆరెస్సెస్ సభ్యుడు ప్రతిజ్ఞ చేస్తాడు. ప్రభుత్వ ఉద్యోగి ఆరెస్సెస్ సభ్యుడైతే అతడు దేశం పట్ల విశ్వసనీయతతో ఉండలేడు' అని అయన ఎక్స్‌లో స్పందించారు.మహాత్మాగాంధీని ఆరెస్సెస్ సభ్యుడు నాథూరాం గాడ్సే హత్య చేసిన అనంతరం 1948లో ఆ సంస్థను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. 'గాంధీ హత్యానంతరం ఆరెస్సెస్‌ను సర్దార్ పటేల్ 1948లో నిషేధించారు. అయితే.. మంచిగా ఉంటామన్న హామీ మేరకు నిషేధాన్ని తర్వాత తొలగించారు. అప్పటికీ ఆరెస్సెస్ నాగపూర్‌లోని తన ప్రధాన కార్యాలయంలో ఎన్నడూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయలేదు' అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తెలిపారు. ఈ ఉత్తర్వులు ఎత్తివేసిన సమయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. '2024 జూన్ 4 తర్వాత 'స్వీయ అభిషిక్త నాన్ బయొలాజికల్' ప్రధానికి, ఆరెస్సెస్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.వాజ్‌పేయి హయాంలో కూడా ఉన్న ఈ 58 ఏళ్ల నిషేధాన్ని జూలై 9, 2024న ప్రధాని ఎత్తివేశారు' అని పేర్కొన్నారు. 'బహుశా అధికారులు ఇప్పుడు నిక్కర్లు వేసుకుని కూడా విధులకు హాజరుకావచ్చునేమో' అని జైరాం రమేశ్ సెటైర్ వేశారు. 2016లో ఖాకీ ప్యాంట్స్‌కు మారడానికి ముందుక ఆరెస్సెస్ సభ్యులు ఖాకీ నిక్కర్లు ధరించేవారు. దీన్ని ఉద్దేశించి జైరాం రమేశ్ ఈ వ్యాఖ్య చేశారు.ఇదిలా ఉంటే.. ప్రభుత్వ చర్యను ఆరెస్సెస్ స్వాగతించింది. దేశ ప్రజాస్వామిక వ్యవస్థను ఈ చర్య మరింత బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించింది. గత ప్రభుత్వాలు సొంత రాజకీయ ప్రయోజనాలకోసమే గతంలో నిషేధం విధించాయని విమర్శించింది.

# ఎవరి వ్యూహాలు వారివి

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ బీఆర్ఎస్ భవిష్యత్ . ఆ పార్టీ బీజేపీతో టై అప్ కోసం చర్చలు జరుపుతోంది. కుదిరితే పొత్తు లేకపోతే విలీనం అన్నట్లుగా ఢిల్లీలో ఒక రౌండ్ చర్చలు ముగిశాయని ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ చీఫ్ కేసీఆర్ ను.. మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ కూడా ప్రశ్నంచారు. స్పందించాలని డిమాండ్ చేశారు. కానీ బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందనా రావడం లేదు. ఈ కారణంగా ఇవాళ కాకపోతే రేపైనా బీఆర్ఎస్ , బీజేపీ విలీనం లేదా పొత్తులు ఖాయమని నమ్ముతున్నారు. ఈ పరిణామం వల్ల బీజేపీ ఎంత లాభ పడుతుందన్న సంగతి పక్కన పెడితే.. అస్థిత్వానికే ముప్పు వచ్చే ప్రమాదమున్నా ఎందుకు బీఆర్ఎస్ తొందరపడుతోంది ? . ఎలాంటి ప్రయోజనాలను ఆశిస్తోంది ? అన్నది పెద్ద పజిల్ గా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత అరెస్ట్ అయి నాలుగు నెలలు దాటింది. ఆమె తీహార్ జైల్లోనే ఉన్నారు. ఆమెను బయటకు తీసుకు రావడానికి కేసీఆర్ రాజకీయ వ్యూహాల పరంగా ప్రయత్నిస్తున్నారని అందుకే బీజేపీతో సంబంధాల దిశగా చర్చలు జరుగుతున్నాయని ఎక్కువ మంది చెప్పుకుంటున్నారు. అయితే ఒక్క బెయిల్ కోసం పార్టీని త్యాగం చేస్తారని ఊహించలేరు. కవితను ఇంకా ఎంతో కాలం జైల్లో పెట్టలేరని..న్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల కేజ్రీవాల్ కు కూడా సుప్రీంకోర్టు ఈడీ కేసులో బెయిల్ మంజూరు చేసింది. అలాగే కవితకూ బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కేసులో చార్జిషీట్ల పేరుతో ఇంత కాలం జైల్లో పెట్టలేరని ... అటూ ఇటూగా జైలు నుంచి వచ్చేస్తారని అనుకుంటున్నారు. మరి ఇలాంటి సమయంలో పార్టీని .. కేవలం కవిత కోసమే బీజేపీ తో పొత్తుల కోసం వెళ్తారని అనుకోవడం లేదు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఆ మధ్య కొంత మంది పార్టీ నేతల్ని కలిశారు. పార్టీ త్వరలో అధికారంలోకి వస్తుందని వారికి ధైర్యం చెప్పారు. అయితే చాలా మంది ఈ విషయంలో క్యాడర్ కు భరోసా ఇవ్వడనికి చెప్పారని అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం అలాంటి ప్లాన్ లో ఉన్నారని బీజేపీతో చర్చల గురించి బయటకు వచ్చిన తర్వాత క్లారిటీ వచ్చింది. బీజేపీతో అయితే పొత్తులు పెట్టుకుని లేకపోతే విలీనం చేసి అయినా సరే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టి.. సంకీర్ణ ప్రభుత్వాన్ని అయినా ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని చెబుతున్నారు. అధికారికంగా బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి ఎనిమిది మంది ఉన్నారు. ఈ రెండు పార్టీలు కలిసినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేరు. కానీ కేసీఆర్.. అరవై మంది ఎమ్మెల్యేలను తీసుకుని వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని ఓ సీనియర్ నేత తనకు ఫోన్ చేశారని ఆయన గతంలో చెప్పారు. బీజేపీ తల్చుకుంటే ఆపరేషన్ కమల్ ప్రారంభిస్తే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని ఆకర్షించడం పెద్ద పనేమీ కాదని ఎక్కువ మంది భావన.

# కలకలం రేపుతున్న రాజకీయదాడులు

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు, హింసాత్మక ఘటనలు అధికారంలోకి వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ జరిగడానికి కారణం అవుతున్నాయి. గత నెలలో కనీవిని ఎరుగని మెజార్టీతో అసెంబ్లీలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. నెల రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు జరిగినా వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్ ఖండిస్తున్నారు. చంద్రబాబు నాయకుల్ని పదేపదే హెచ్చరిస్తున్నారు రౌడీయిజం, గుండాయిజాన్ని సహించేది లేదని, నాయకులు సంయమనం పాటించాలని కొత్త ప్రభుత్వాన్నిముందుకు తీసుకు వెళ్లేందుకు సహకరించాలని కోరుతున్నారు.పార్టీ అధినేతలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా దాడులు, హింసాత్మక ఘటనలకు మాత్రం అడ్డు పడటం లేదు. బుధవారం రాత్రి వినుకొండలో వైసీపీ సానుభూతిపరుడైన యువకుడిని ప్రత్యర్థి దారుణంగా నరికి చంపడం తీవ్ర సంచలనం సృష్టించింది. గత నెల రోజులుగా అధికార పార్టీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు పెద్దగా ప్రచారం లభించకపోయినా బుధవారం జరిగిన యువకుడి దారుణ హత్య అందరిని ఉలిక్కి పడేలా చేసింది. పల్నాడు జిల్లా ఎస్పీని బదిలీ చేసిన రోజుల వ్యవధిలో పల్నాడులో జరిగిన హత్య, వైసీపీకి రాజకీయంగా ఊపిరి పోసింది.నడిరోడ్డుపై జరిగిన హత్యపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. గురువారం ఉదయంలోపు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వీడియోలు వైరల్‌గా మారాయి. టీడీపీ జరుగుతున్న నష్టాన్ని గుర్తించేలోపు వినుకొండ యువకుడి హత్య ఘటన వైరల్ అయిపోయింది. టీడీపీ నేతలు హత్యకు పాల్పడిన జిలానీ తమ పార్టీకి చెందిన వాడు కాదని, ఇద్దరి మధ్య పాతకక్షలతో ఘటన జరిగిందని చెప్పుకునే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది.ఏపీలో ఘోర పరాజయం తర్వాత అసెంబ్లీలో అడుగు పెట్టడానికి కూడా వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆసక్తి చూపలేదు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత బెంగుళూరు వెళ్లిపోయారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఉండటానికే జగన్ బెంగుళూరు వెళ్లిపోయారని టీడీపీ నేతలు విమర్శించారు. వినుకొండలో రషీద్ హత్య తర్వాత జగన్ వెంటనే విజయవాడ వచ్చారు.బుధవారం రాత్రి వినుకొండలో రషీద్ అనే యువకుడిని షేక్ జిలానీ అనే మరో యువకుడు హత్య చేశాడు. వీళ్లిద్దరూ ఒకప్పుడు స్నేహితులే. వైసీపీలో ఉండేవారు. వినుకొండలో రౌడీగా చలామణీ అవుతున్న పీఎస్ ఖాన్ ముఠాలో రషీద్, జిలానీ సభ్యులుగా ఉండేవారు. తర్వాత . వీరి మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. 2022 తొలి ఏకాదశి రోజున వినుకొండలో జరిగే కొండ తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీలో వీరి మధ్య గొడవలు మొదలయ్యాయి.ఖాన్ ఓ లాడ్జిలో నిర్వహించిన పార్టీలో జిలానీ బీర్ బాటిళ్లతో దాడి చేయడంతో ఒక యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటనలో ఖాన్.. రషీద్ కు మద్దతుగా నిలిచాడు. జిలానీపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆ తర్వాత రషీద్, ఖాన్ గ్యాంగ్‌లో మరి కొందరు గత ఏడాది జూలైలో జిలానీ ఇంటిపై దాడి చేశారు. జిలానీ ఇంట్లో లేకపోవడంతో అతని అన్న జానీపై దాడి చేసి గాయపరిచారు.ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. ఇంటి ముందు వాహనాన్ని కూడా తగలపెట్టారు. ఎమ్మెల్యే బొల్లా కారణంగా పోలీసులు జిలానీ కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు పట్టించుకోలేదు. యువకుడిపై దాడి కేసులో జిలానీపై హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపారు. దీంతో గత ఏడాది అతని టీడీపీ గూటికి చేరాడు. అదను చూసి హత్యకు పాల్పడ్డాడు. తన ఇంటిపై రషీద్ దాడి చేసిన రోజే



ప్రత్యర్థిని మట్టుబెట్టాడు.జిలానీ, రషీద్‌ల మధ్య ఉన్న వ్యక్తిగత శతృత్వాలకు రాజకీయాలు అండగా నిలవడతంతో అవి కాస్త హత్యలకు తెగించేలా ప్రోత్సహించాయి. వినుకొండలో హత్య తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రం విడుదలను కూడా వాయిదా వేసుకున్నారు. గురువారం శాంతిభద్రతలపై సచివాలయంలో చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయాల్సి ఉంది. అదే సమయంలో వినుకొండ హత్య తీవ్ర సంచలనం సృష్టించడంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. వచ్చే వారం మొదలయ్యే అసెంబ్లీ సమావేశాల్లో వాటిని విడుదల చేయాలని నిర్ణయించారు.వినుకొండలో జరిగిన హత్యపై వైసీపీ అధ్యక్షుడు ప్రధానికి లేఖరాశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని,వైసీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి, ఆ వెంటనే.. ఈ ఎన్నికల్లో తమను సమర్థించని, తమకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా మా పార్టీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను వేధించడమే పనిగా పెట్టుకుంది.తమ కార్యకర్తల్ని కొట్టడం, చంపడం, దారుణంగా వేధించి భయానక పరిస్థితులు సృష్టించడం వంటివన్నీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆస్తులు విధ్వంసం చేస్తున్నారు. ఇళ్లు, భవనాలు కూల్చేస్తున్నారు. వ్యాపార సంస్థలపైనా దాడులు చేస్తున్నారు. పట్టపగలు యథేచ్ఛగా కొనసాగుతున్న ఈ ఘటనలు రాష్ట్రంలో ఒక భయానక పరిస్థితి నెలకొనేలా చేస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. శుక్రవారం హత్యకు గురైన రషీద్‌ను పరామర్శించేందుకు వినుకొండ వెళ్లారు.పార్టీలు మారినా పాలనలో మార్పు రాకపోవడంపై ఏపీ ప్రజల్లో నిర్లిప్తత ఏర్పడింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రాజకీయ వాతావరణం హింసాత్మకం తయారవడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో చాలామంది సేవల్ని ప్రభుత్వం వాడుకునే పరిస్థితులు లేవు. గతంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే కారణాలతో వారిని పూర్తిగా పక్కన పెట్టేశారు.కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి బోలెడు సవాళు ఉన్నాయి. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఓ వైపు ఎన్నికల హామీల అమలుపై పైసపైస కూడబెట్టుకుంటోంది. ఈ క్రమంలో రాజకీయంగా ప్రత్యర్థులు బలపడేలా జరుగుతున్న ఘటనలు, వాటిని కనీసం ఖండించలేని వాతావరణం రాష్ట్ర ప్రజల్ని అయోమయంలో పడేస్తున్నాయి. పార్టీలు, ప్రభుత్వాలు మారినా ఏపీ తలరాత మారదనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

# చర్యలు సాధ్యమేనా

హైదరాబాద్, : భారత రాష్ట్ర సమితి నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేల పై ఖచ్చితంగా అనర్హతా వేటు పడుతుందని ఉపఎన్నికలు వస్తాయని కేటీఆర్ ఘంటాపథంగా చెబుతున్నారు. అంతకు ముందు తాము విలీనం చేసుకున్నామని ఫిరాయింపులు కాదని అందుకే అనర్హతా వేటుకు అవకాశం లేదని కేటీఆర్ చెబుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని అందుకే అనర్హతా వేటు ఖాయమంటున్నారు. న్యాయపోరాటం చేస్తున్నారు. హైకోర్టులో పిటిషన్లుపై విచారణ జరుగుతున్నాయి. కేటీఆర్ ప్రయత్నాలు ఫలించే అవకాశాలు ఉన్నాయా అంటే.. చాన్సే లేదన్న భావన ఎక్కువగా వినిపిస్తోంది. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రజాప్రతినిధిగా ఎన్నికల పార్టీకి రాజీనామా చేసినా ఇతర పార్టీ సభ్యత?వం తీసుకున్నా అనర్హులవుతారు. 1985లో రాజీవ్గాంధీ ప్రభుత్వం రాజకీయ ఫిరాయింపులను అరికట్టడానికి ఫిరాయింపుల వ్యతిరేకతపై 52వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని చేసింది. దీనిని రాజ్యాంగంలో 10వ షెడ్యూల్లో చేర్చారు. అయితే... అంతా స్పీకర్ నిర్ణయం మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ చట్టం కింద ఒక సభ్యుని అనర్హతకు కోర్టులకు అధికారం లేదు. పార్టీ ఫిరాయింపు, పార్టీలో చీలిక, పార్టీ విప్పు ధిక్కరించి ఓటు వేయడం లేక గైర్హాజరు కావడం మొదలైన అంశాలు వివాదాస్పదంగా మారినప్పుడు ఆ వివాదాలపై అంతిమ నిర్ణయం స్పీకర్కు వదిలేయాలని చట్టంలో ఉంది. అధికార పార్టీకి చెందిన స్పీకర్లు ఇప్పుడు నిర్ణయాలు తీసుకోవడం లేదు. చట్టంలో ఉన్న లొసుగుల్ని బట్టి రాజకీయ నేతలు కూడా వ్యవహరిస్తున్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ఉంది కానీ.. అది స్పీకర్ చేతుల్లో ఉంటుంది కాబట్టి... ప్రయోజనం లేకుండా పోయింది. దేశంలో స్పీకర్లందరూ... అదే చేస్తున్నారు. ఈ చట్టాన్ని మార్చాలి. పార్టీ మారిన వెంటనే అనర్హతా వేటు పడేలా చేయాలి. అలా చేస్తే తప్ప ఇప్పుడు కేటీఆర్ చెబుతున్నట్లుగా అనర్హతా వేటు పడటానికి అవకాశం లేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో గతంలో బీఆర్ఎస్ స్పీకర్లూ అదే చేశారు. కేటీఆర్ తాము ఎల్పీలను విలీనం చేసుకున్నామని చెబుతున్నారు. కానీ 2014లో మొదట టీడీపీ సభ్యులను చేర్చుకున్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కు మంత్రి పదవి కూడా ఇచ్చారు. టీడీపీ ఎమ్మెల్యేగా ఉండి ఆయన బీఆర్ఎస్ సర్కార్ లో మంత్రిగా ఉన్నారు. ప్రమాణ స్వీకారం చేయించడానికి గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. టీడీపీ దాఖలు చేసిన అనర్హతా పిటిషన్లను పట్టించుకోలేదు. శాసనమండలి చైర్మన్ కూడా అదే చేశారు. 2022 మేలో శివసేన నుంచి కొంత మంది ఎమ్మెల్యేలు, బీజేపీ కలిసి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2023 జూలైలో ఎన్సీపీ నేత అజిత్ పవార్, తన పార్టీని చీల్చి 40 మంది ఎమ్మెల్యేలు, 5గురు ఎమ్మెల్సీలతో కలిసి షిండే క్యాబినెట్లో చేరి ఉపముఖ్యమంత్రిగా పదవి తీసుకున్నారు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌కు లేఖ అందజేశారు. అయితే స్పీకర్ పట్టించుకోక పోవడంతో శరద్ పవార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పలుమార్లు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది కానీ ఫలానా నిర్ణయం అని చెప్పలేదు. అదే సమయంలో స్పీకర్ కూడా తన విచక్షణాధికారం అని సుప్రీంకోర్టు ఆదేశాలను పెద్దగా పట్టించుకోలేదు. అయితే తర్వాత నిర్ణయం తీసుకున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మహారాష్ట్ర వరకే పరిమితం కనీ దేశానికి వర్తిస్తాయని.. కేటీఆర్ వాదిస్తున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వ లాయర్లు మాత్రం స్పీకర్ విధుల్లో జోక్యం చేసుకోలేరని వాదిస్తున్నారు. ఎలా చూసినా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారమే ఫైనల్. ఆయన తన పార్టీ నిర్ణయం.. గత సంప్రదాయాల ప్రకారమే వ్యవహరించే అవకాశం ఉంది. అంటే అనుకుంటే తప్ప... ఎవరిపైనా అనర్హతా వేటు పడే అవకాశం లేదు.

# విదేశీ విద్యానిధి ఎప్పుడు?



హైదరాబాద్, : విదేశీ విద్యానిధి కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ ఎప్పుడు అందుతుందా? అని ఎదురుచూస్తున్నారు. అసలు వస్తుందా? రాదా? ప్రభుత్వం ఇస్తుందా? ఇవ్వదా? అని ఆందోళనకు గురవుతున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయి 7 నెలలు గడుస్తున్నా, విదేశాల్లో అభ్యాసం పూర్తయ్యేందుకు సమయం దగ్గరపడుతున్నా తుది జాబితాపై ఇప్పటికీ అతీగతీ లేకుండాపోవడమే ఇందుకు కారణం. మరోవైపు స్కాలర్‌షిప్‌పై ఆశతో అప్పులు చేసి తమ పిల్లలను విదేశీవిద్య కోసం పంపిన తల్లిదండ్రులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తుది జాబితా ఎప్పుడు ప్రకటిస్తారని బీసీ సంక్షేమశాఖ అధికారులను అడిగితే.. ప్రభుత్వం నుంచి ఇంకా కొత్త మార్గదర్శకాలు రాలేదని, అవి వచ్చే వరకూ ఏమీ చేయలేమని తేల్చిచెప్తున్నారు.గత ఫాల్ సీజన్‌కు 2,665 మందికి దరఖాస్తు: పేదింటి బీసీ బిడ్డలు విదేశాల్లో మాస్టర్స్, పీజీ, పీహెచ్‌డీ కోర్సులను అభ్యసించేందుకు వీలుగా గతంలో కేసీఆర్ ప్రభుత్వం జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి సంవత్సరం జనవరి (ఫాల్ సీజన్)లో 150 మంది, ఆగస్టు (స్ప్రింగ్ సీజన్)లో 150 మందికి కలిపి మొత్తంగా 300 మందికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేయడంతోపాటు వీసా చార్జీలు, ప్రయాణ ఖర్చుల నిమిత్తం గరిష్ఠంగా రూ.50 వేల చొప్పున అందజేసింది. కాగా, బీసీ ఓవర్సీస్ పథకం కింద గత ఫాల్ సీజన్‌కే 2,665 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2,023 మంది బీసీలు, 642 మంది ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులున్నారు. వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జనవరిలోనే పూర్తయినప్పటికీ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన అర్హుల జాబితాను మాత్రం ఇప్పటికీ ప్రకటించలేదు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు: కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలకు మించని విద్యార్థులకు విదేశీ విద్యానిధి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. అకడమిక్ మార్కులకు 60%, జీమ్యాట్/జీఆర్ఈ 20%, టోఫెల్, ఐఎల్స్, పీటీఈ పరీక్షల్లో వచ్చిన మార్కులకు 20% వెయిటేజీ ఇచ్చి, ఆ మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. దీంతో ఆయా అర్హతలున్న విద్యార్థులు తమకు తప్పకుండా స్కాలర్‌షిప్ వస్తుందన్న ధీమాతో విదేశాల్లో విద్యనభ్యసించేందుకు వెళ్లారు. అదే ధీమాతో పలువురు తల్లిదండ్రులు అప్పులు తెచ్చి తమ పిల్లలను విదేశాలకు పంపారు. ఇలా గత ఫాల్ సీజన్‌కు దరఖాస్తు చేసుకుని విదేశాలకు వెళ్లిన విద్యార్థుల్లో పలువురు ఇప్పటికే 2 సెమిస్టర్లను పూర్తిచేసుకోగా.. మరికొందరికి త్వరలో మూడో సెమిస్టర్ కూడా పూర్తికానున్నది. అయినా ప్రభుత్వం ఇప్పటికీ ఆర్థిక సాయం ప్రకటించలేదు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.21 కోట్లు కేటాయించినప్పటికీ రూ.15 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఆ నిధులతో గతంలో ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేందుకు సైతం సరిపోని పరిస్థితి నెలకొన్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి. కొత్త మార్గదర్శకాలు వచ్చేదెప్పుడు?: వాస్తవానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తవగానే మెరిట్ జాబితాను రూపొందించి స్టేట్ లెవల్ స్క్రీనింగ్ కమిటీకి పంపాల్సి ఉంటుంది. ఆ కమిటీలోని సంబంధిత విభాగం అధికారులతోపాటు, హయ్యర్, టెక్నికల్ ఎడ్యుకేషన్, జేఎన్టీయూకి చెందిన సభ్యులు అర్హులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ, ప్రస్తుతం ఫాల్ సీజన్‌కు సంబంధించి మెరిట్ జాబితానే అధికారులు ఇంకా రూపొందించలేదని తెలుస్తున్నది. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం మార్గదర్శకాలను మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమైనట్టు అధికారులు వెల్లడించారు. ఏటా 300 మందికి కాకుండా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలని, విదేశాల్లోని టాప్-500 యూనివర్సిటీల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని, పన్ను చెల్లింపుదారులను మినహాయించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆదేశించినట్టు చెప్తున్నారు. కానీ, అందుకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయినప్పటికీ తుదిజాబితాను రూపొందించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నట్టు తెలుస్తున్నది.

# సయోధ్యే లక్ష్యం..

హైదరాబాద్,రాజకీయ పునరేకీకరణ కోసం సీఎం రేవంత్ రెడ్డి కమ్మల మద్దతు సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారా? కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) సదస్సులో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఇందులో భాగమేనా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ పరిశీలకులు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆరెస్‌తో ఉన్న సెటిలర్లను తమవైపు తిప్పుకొనే కార్యక్రమాలను వేగవంతం చేశారన్న చర్చ జరుగుతున్నది. రాష్ట్ర విభజనకు ముందు తెలంగాణలో ఒక బలమైన పార్టీగా టీడీపీ ఉన్నది. ఆంధ్రా సెటిలర్లు మెజార్టీగా టీడీపీతో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీడీపీతో ఉన్న సెటిలర్లతో పాటు టీడీపీ నేతలు మెజార్టీగా బీఆరెస్‌లో చేరారు. టీడీఎల్పీని బీఆరెస్ ఎల్పీలో విలీనం చేశారు.బీఆరెస్‌లో చేరడానికి ఇష్టం లేని రేవంత్ రెడ్డి, సీతక్క, వేం నరేందర్ రెడ్డి లాంటి నాయకులు తరువాత కాలంలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే రాష్ట్ర ఏర్పాటు నుంచి 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న బీఆరెస్‌తో ఉండి తమ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలు పొందిన సెటిలర్లు, ముఖ్యంగా కమ్మలు తాజాగా కాంగ్రెస్‌కు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో రాజకీయంగా బలం పెంచుకునే పనిలో రేవంత్ ఉన్నారు. ఈ మేరకు రాజకీయ శక్తుల పునరేకీకరణలో భాగంగా తెలంగాణలో హైదరాబాద్‌తోపాటు వివిధ జిల్లాల్లో సెటిలైన కమ్మ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలబెట్టుకునే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే బీఆరెస్ నుంచి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన అరికెపూడి గాంధీని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. మిగతా ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

### వ్యాపారాలు అమరావతికి తరలకుండా వ్యూహం

తెలంగాణలో వివిధ రంగాలలో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తున్న కమ్మ పెట్టుబడి దారులను కూడా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నాలు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. వారు ఇక్కడే వ్యాపారాలు చేసుకోవచ్చునన్న భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. అందుకే హైదరాబాద్ కేంద్రంగా జరిగిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్( కేజీఎఫ్) కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారని, కమ్మలకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారని చెబుతున్నారు. కమ్మలకు రెడ్లు వ్యతిరేకం కాదనే సంకేతాన్ని ఇచ్చారు. కమ్మలు, రెడ్లు కలిసి సయోధ్యగా ఉండి అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకుందామన్న సందేశాన్ని ఇచ్చారు.

### ఏపీలో కమ్మ, రెడ్ల మధ్య విభేదాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో రెడ్లకు, కమ్మలకు మధ్య తీవ్ర వైరుధ్యాలున్నాయి. అక్కడి రాజకీయాలు మెజార్టీగా కులాల ప్రాతిపదికన జరుగుతాయన్నది బహిరంగ రహస్యమే. అయితే తెలంగాణలో అలాంటి వైరుధ్యాలు లేవన్న సంకేతాన్ని రేవంత్ రెడ్డి ఇచ్చారని అంటున్నారు. ఏపీలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కమ్మలు తమ వ్యాపారాలను ఇకపై అమరావతి కేంద్రంగా చేస్తారన్న చర్చ కూడా ఉంది. ఇదే జరిగితే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌తోపాటు ఇతర వ్యాపారాలపై కొంత ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఇలాంటి సమయంలో కమ్మలకు, ఇతర ఆంధ్రా సెటిలర్లకు ఇక్కడ వ్యాపారాలు నిక్షేపంగా చేసుకోవచ్చునని, తమ మద్దతు ఉంటుందన్న సంకేతాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆ సమావేశానికి హాజరవడం ద్వారా ఇచ్చారన్న చర్చ రాజకీయ వర్గాలలో జరుగుతోంది.

# పెద్దవాగు ప్రాజెక్టు గండికి అసలు కారకులెవరు

ఖమ్మం, : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు గండికి అసలు కారకులెవరు.? రెండు తెలుగు రాష్ట్రాల నడుమ ఉన్న ఈ ప్రాజెక్టుకు భారీ గండి పడి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లడానికి బాధ్యులెవరు.? ఈ గండి పడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్లక్షమే కారణమా.? లేక తెలంగాణ ప్రభుత్వ ఏమరుపాటు కారణమా..? ఇప్పుడు ఈ ప్రశ్నలు ఇరు రాష్ట్రాల ప్రజల మెదళ్లను తొలుస్తున్నాయి.ఈ ప్రాజెక్టుకు పడిన భారీ గండితో రూ.150 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. 1975వ సంవత్సరంలో ఈ మధ్యతరహా ప్రాజెక్టును నాటి రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామ సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మితమైంది. అయితే రాష్ట్రం విడిపోయిన తర్వాత ఈ ప్రాజెక్టు తెలంగాణలో మిగిలిపోగా దీని కింద సాగయ్యే ఆయకట్టు మొత్తం ఆంధ్రప్రదేశ్ లో భాగమైంది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఇరు రాష్ట్రాలతో అనుబంధం ఏర్పడింది.తాజాగా భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల సామర్థ్యం, క్రస్ట్ గేట్ల పని తీరుపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. పెద్ద వాగు ప్రాజెక్టుకు గండి పడిన తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో చీఫ్ ఇంజనీర్లు ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఏఈలు క్షేత్ర స్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో నలుగురు అధికారులను బాధ్యులను చేస్తూ వారికి మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది.పెద్దవాగు ప్రాజెక్టుకు గండి కారణంగా సుమారు రూ.150 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

# మళ్లీ మొదలైన గాడిద గుడ్డు పోస్టర్లు




హైదరాబాద్,మళ్లీ తెలంగాణలో గాడిద గుడ్డు పోస్టర్లు.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో తెలంగాణకు పదేండ్లుగా అధికారంలో వున్న మోడీ సర్కార్.. చేసింది ఏమి లేదని, గాడిద గుడ్డని ప్రచారం చేసిన కాంగ్రెస్ మళ్లీ నిన్న పార్లమెంట్ బడ్జెట్ లో తెలంగాణకు మోడీ సర్కార్ ఏమి ఇవ్వలేదని ఫైర్ తెలంగాణ నుండి 8 ఎంపీ సీట్లను గెలిపిస్తే.. రాష్ట్రానికి మోడీ సర్కార్ గాడిద గుడ్డు ఇచ్చిందని పోస్టర్లు వేసిన వైనం. గ్రేటర్ హైదరాబాద్ లోని పలు బస్టాండ్లకు హోర్డింగ్ లకు గాడిద గుడ్డు పోస్టర్లు.కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో బ్యానర్లు ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఇటీవలి బడ్జెట్ లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏమిచ్చింది..? గాడిద గుడ్డు అంటూ వినూత్న రీతిలో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలిచింది. అయితే 8 ఎంపీ సీట్లు ఇచ్చిన తెలంగాణకు కేంద్ర బడ్జెట్ లో దక్కింది గాడిద గుడ్డు అంటూ బ్యానర్లలో పేర్కొన్నారు. హైదరాబాద్ లోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

# రంగారెడ్డి జిల్లాపై కరుణించని వరుణుడు

రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు నెల్కొన్నాయి. ఇప్పటి వరకు భారీవర్షం కురిసిన దాఖలాలు లేవు. వర్షాకాలం ప్రారంభమై 50 రోజులు దాటిపోయింది. రికార్డు స్థాయిలో వర్షం లేకపోవడంతో సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు అంతంత మాత్రమే ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే తప్పా భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు లేవు. వ్యవసాయం ముందుకు సాగాలంటే భారీ వర్షాలు కురవాల్సిందే. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో సాధారణ వర్షాపాతమే నమోదవుతుండగా, వికారాబాద్ జిల్లాలో మాత్రం కాస్త నయం అనే విధంగా వర్షాలు కురుస్తున్నాయి.

అడవులు అంతరించిపోవడమే..

హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విస్తరించి ఉంది. వ్యవసాయ భూములను కూడా ప్లాట్లుగా విభజించి నిర్మాణాల చేపడుతున్నారు. ఒకప్పుడు చెట్లతో నిండుగా కనిపించే శివారు ప్రాంతాలు ఎడారిగా మారిపోయాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 33 శాతం మేర అటవీ సంపద ఉండేది. ప్రస్తుతం అడవులు అంతరించిపోవడంతో ఐదు శాతం కూడా లేని పరిస్థితి. ప్రతి ఏటా దాదాపుగా 80 లక్షల మేర మొక్కలు నాటుతున్నారు. అటవీ సంపద దక్కుతున్న నేపథ్యంలో జిల్లాలో వర్షాల సంఖ్య కూడా ఘననీయంగా తగ్గుతోంది.

సాగుకు ఉపయోగపడే వర్షాలు లేవు..

వానాకాలం సీజన్ ప్రారంభమై నెలన్నర దాటిపోయింది. సాగుకు ఉపయోగపడే వర్షాలు ఇంతవరకు పడలేదు. సెంటిమీటర్ల మేర వర్షం కురిసిన పరిస్థితులు లేవు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు లేవు. అంతా వర్షాలపైనే ఆధారపడి సాగు చేయాల్సిన పరిస్థితి. పుష్కలంగా వర్షాలు కురిస్తే తప్పా బోరుబావుల్లోకి నీరు చేరే పరిస్థితులు లేవు.

రంగారెడ్డిలో..

ఈ సారి ఆశించిన మేర వర్షాలు కురవ లేదు. రంగారెడ్డి జిల్లా పరిధిలో 27 మండలాలున్నాయి. ఇందులో 23 మండలాల పరిధిలో సాధారణ వర్షపాతమే నమోదయింది. నాలుగు మండలాల పరిధిలో మరింత తక్కువ వర్షం కురిసింది. జూన్లో సాధారణ 94 మిల్లీమీటర్ల వర్షపాతానికి 97 మిల్లీమీటర్లు కురిసింది. ఈ నెలలో 146.6 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం కాగా ఇప్పటివరకు 121.9 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది.

మేడ్చల్ మల్కాజ్గిరిలో

మేడ్చల్మల్కాజ్గిరి జిల్లా పరిధిలో 14 మండలాల పరిధిలో సాధారణ వర్షమే కురవగా కేవలం ఒక్క మండలంలోనే సాధారణ వర్షపాతానికి మించి వర్షం కురిసింది. ఈ జిల్లాలో 20 మండలాలుండగా ఇందులో 16 మండలాల పరిధిలో సాధారణ వర్షపాతానికి మించి వర్షం కురిసింది.

సాగుపై తీవ్ర ప్రభావం

ఆశించినమేర వర్షాలు కురవకపోవడంతో సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో రికార్డు స్థాయిలో వ్యవసాయం



కొనసాగుతుండగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలో వ్యవసాయం చాలా వరకు తగ్గిపోయింది. మేడ్చల్ పరిధిలోని మెజార్టీ ప్రాంతాలు దాదాపుగా హైదరాబాద్లో కలిసిపోయాయి. దీంతో ఈ జిల్లాలో సాగు విస్తీర్ణం రోజురోజుకు తగ్గుతోంది.

ముందుకు సాగని సాగు

రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుత సీజన్కు సంబంధించి నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ ఇప్పటివరకు కేవలం 1.60 లక్షల ఎకరాల్లో కూడా పంటలు సాగు కాలేదు. వికారాబాద్ జిల్లాలో కాస్త మెరుగ్గా ఉన్నా పూర్తి స్థాయిలో సాగు కాలేదు. ఈ జిల్లాలో 5.78లక్షల ఎకరాలు సాధారణ సాగు కాగా ఇప్పటివరకు 3.40 లక్షల ఎకరాల పరిధిలో మాత్రమే పంటలు సాగయ్యాయి. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో సాధారణ సాగు కేవలం 23 వేల ఎకరాలే. ఇందులో సాగు చేసింది మాత్రం 4050 ఎకరాల వరకే. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్నాయి. భారీ వర్షాలు కురిస్తే తప్పా వ్యవసాయ పనులు జోరందుకునేలా కనిపించడం లేదు.

ఇప్పుడిప్పుడే ప్రారంభమైన వరి నాట్లు

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో పత్తి, వరి, మొక్క జొన్న పంటలు ప్రధాన పంటలు. ఇవి కూడా పూర్తి స్థాయిలో సాగుకాని పరిస్థితి. రంగారెడ్డి జిల్లాలో వరి నాట్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. నీటి వసతులు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వరినాట్లు వేస్తున్నారు. మెజార్టీ రైతులు భారీ వర్షాలు కురిస్తే తప్పా వరినాట్లు ప్రారంభించే అవకాశాలు కనిపించడం లేదు. రంగారెడ్డి జిల్లాలో 1.78 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 1.07 లక్షల ఎకరాల్లో మాత్రమే పత్తి సాగయ్యింది. లక్ష ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 2 వేల ఎకరాల్లో కూడా నాట్లు వేయని పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మాత్రం సాగు విస్తీర్ణం చాలావరకు తగ్గే ప్రమాదం ఉంది.

# అబద్ధాల ప్రచారంలో ఆరితేరారు !

హైదరాబాద్,పదేళ్లపాటు రాష్ట్రాన్ని అడ్డదిడ్డంగా పాలించి, అక్రమాలకు పాల్పడి, అవినీతిని మూటకట్టుకుని, రాష్ట్రాన్ని దివాళా తీయించిన కెసిఆర్ కుటుంబం ఇప్పుడు కాంగ్రెస్ను ఎలా పడగొట్టాలా అన్న ఆలోచనలో పడింది. ఎమ్మెల్యేలు పార్టీని వీడిపోతున్నా..కట్టడి చేసుకోలేని వారు.. మళ్లీ తమదే రాజ్యం అని విర్రవీగుతున్నారు. అవినీతిలో మునిగి తేలిని వారికి అధికారలేమి ఉక్కపోతగా మారింది.అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై అదేపనిగా విమర్శలు ఎక్కుపెడుతోంది. నవ్విపోదురు గాక నాకేంటి అన్న చందంగా పదేపదే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విమర్శలు చేస్తోంది. తమ అవినీతి బయట పడకుండా, తమ అక్రమాలు ప్రజలు గుర్తించకుండా ఎదురుదాడి మార్గాన్ని బిఆర్ఎస్ నేతలు ఎంచుకున్నారు. హరీష్రావు, కెటిఆర్, నిరంజన్ రెడ్డి, జగదీశ్ రెడ్డిలు ఇందులో ప్రధాన భాగస్వాములుగా రోజూ విమర్శలు తప్ప మరో పనిలేకుండా సాగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతిని వెలుగులోకి తీసుకొస్తూనే ఉంది. రైతుబంధు కింద గుట్టలకు, వెంచర్లకు, హైవేలకు నగదును అందజేసిన ఘనత మన కెసిఆర్ ప్రభుత్వానిది. రైతుభరోసా కింద ఇప్పుడు అర్హులకే సాయాం అందించాలని సర్కార్ నిర్ణయిం చింది. ఇలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అర్హులైన రైతులకే సాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా ఏదైనా పొరపాటు ఉందా లేదా అన్నది కూడా చూడకుండా భూతద్దం పెట్టి వెతికే పనిలో పడ్డారు. ఏడు నెలలకే బ్రహ్మాండం బద్దలు అయినట్లు.. తామంతా బంగారం తావడం చేస్తే..కరగనాకినట్లుగా గగ్గోలు పెడుతున్నారు. ప్రజలు వీరికి సిగ్గులేదా అని ఈసడించుకుంటున్నారు. ఉన్న ఎమ్మెల్యేలు జారుకుంటు న్నారు. మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతలు పెట్టారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ఇంకా ఎలాంటి వాతలు పెడితే మార్పు వస్తుందో ప్రజలు గుర్తించి, ఆపని చేయాల్సి ఉంది. దాదాపు ఏడున్నర లక్షల కోట్లు అప్పులు చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో భారీ అవినీతికి పాల్పడ్డారు. అవినీతిపై విచరాణ జరక్కుండా కోర్టులకు ఎక్కారు. విచారణ జరపరాదని కోరుకున్నారు. కానీ సుప్రీం సుతిమెత్తగా మొట్టికాయలు వేసిందనే చెప్పాలి. విచారణ కమిషన్ జడ్జిని మార్చండి అని చెప్పిందే తప్ప..విచారణ ఆపమని చెప్పలేదు. దీనికి కూడా సుప్రీం తమకే అనుకూలంగా చెప్పిందని కెటిఆర్ తదితరులు జబ్బలు చర్చుకున్నారు. విద్యుత్ ఒప్పందాలపై అవినీతి జరక్కుంటే ..కెసిఆర్ మహాశయుడు ఎందుకు విచారణ ఆపమంటున్నారో చెప్పడం లేదు. అవినీతి లేకుంటే బాజాప్తా కమిషన్ ముందు తన వాదన వినిపించ వచ్చు. ప్రజలు కేవలం కెసిఆర్ కుటుంబ అహంకారంతో విసిగిపోయి కాంగ్రెస్కు పట్టం కట్టారు. ఈ విషయం తెలియకుండా ప్రజలు పొరపాటు కాంగ్రెస్కు ఓటేశారని ప్రజలను కూడా తప్పుపడుతున్నారు. నిజానికి కాంగ్రెస్ వారు అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం ఏడున్నల లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. అయినా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని భరోసా ఇస్తోంది. ప్రతిపక్ష పార్టీల విమర్శలకు చెక్ పెడుతూ సీఎం రేవంత్రెడ్డి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నారు. మహలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంట్ బిల్లును ఉచితంగా అమలు చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్కు రూ.500లను కూడా అమలు చేస్తూ పేద ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది. కానీ బిఆర్ఎస్ నేతలు ఆరింట ఒక్కటే అమలవుతోందని గుడ్డిగా విమర్శలు చేసి నవ్వులపాలు అవుతున్నారు. ఇక అన్నింటిని మించిన రైతు రుణమాఫీకి కూడా శ్రీకారం చుట్టింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 'రైతు రుణమాఫీ' అమలుకు శ్రీకారం చుట్టారు. ఆగస్టు 15 గడువు కంటే ముందే ఏకకాలంలో రుణమాఫీ చేసేలా సీఎం రేవంత్రెడ్డి కసరత్తు మొదలు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90లక్షల రేషన్కార్డులు ఉన్నాయి. ఇందులో రుణాలు ఉన్న రైతుల ఖాతా సంఖ్య 70లక్షలే. ఇంకా దాదాపు 6.36 లక్షల మంది రైతులకు రుణాలు ఉన్నా రేషన్ కార్డులు లేవు. వారందరినీ కూడా దృష్టిలో ఉంచుకుని రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. 2014 ఎన్నికల్లో తెలంగాణలోని రైతులందరికి లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని కేసీఆర్ చెప్పారు. అధికారంలోకి వచ్చాక విడతల వారీగా రూ.25వేల రూపాయలు చొప్పున లక్ష వరకు చేశారు. ఆ లబ్ది కూడా అరకొర రైతులకే లబ్ది చేకూరింది. కేంద్ర ప్రభుత్వం అందజేసే ఫసల్ బీమాను కూడా అహంకారపూరిత ధోరణితో కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేయలేదు. దీంతో పంట నష్టం వాటిల్లినప్పుడు ఎంతోమంది రైతులు ఆర్థికంగా చితికిపోయారు. రాష్ట్ర ప్రభుత్వమైనా ఆదుకుందా అంటే అదీ లేదు. ఏనాడూ బీఆర్ఎస్ నాయకులు రైతుల పొలాలను పరిశీలించిన పాపాన పోలేదు. రైతులు ఏం పంట వేయాలో తామే చెబుతామని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తామంటూ నష్టాల ఊబిలోకి దించారు. రబీలో పంట వేసుకోవాలా వద్దా, వేస్తే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేదా అన్న సంశయంతో చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరం అయ్యారు. తెచ్చిన అప్పులు కట్టలేక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాటిని కూడా గత ప్రభుత్వం దాచిపెట్టింది. రైతు బీమా కింద నగదును అందజేశారంటే ఎంతమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారో అర్థం అవుతుంది. ఇంతేగాక రైతులకు సంకెళ్లు వేసిన ఘనత కూడా మాజీ సీఎం కేసీఆర్కే దక్కుతుంది. ప్రాజెక్టుల రీడిజైన్, నూతన ప్రాజెక్టుల నిర్మాణాల పేరిట రైతుల నుంచి భూములు లాక్కుని వారిని నడిసంద్రంలో వదిలేసిన పాపం కూడా బీఆర్ఎస్కే దక్కుతుంది. నష్ట పరిహారం అడిగితే లాఠీలతో భయపెట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. భారీ లెక్కలతో పబ్బం గడిపారే తప్ప ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాలకు, రైతుల అభివృద్ధికి పాటుపడలేదు. తెలంగాణ ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్తో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారు. అదేమంటే ఆస్తులు సమకూర్చామని చెబుతున్నారు. ఆస్తులు మాత్రం కెసిఆర్ కుటుంబ సభ్యులు సమకూర్చుకున్నట్లుగా ఉంది. అప్పులను తగ్గించుకుంటూ..వడ్డీల భారన్నా తగ్గించేలా ప్రణాళికలు వేసుకుంటూ..ఇచ్చిన హామీలను అమలు చేసేలా కాంగ్రెస్ నడుం బిగించింది. రైతురుణమాఫీ అమలు కోసం నిద్రలేని రాత్రులు గడిపామని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యల్లో చిత్తశుద్ధి ఉంది. ఎందుకంటే ఈ హామీ అమలు కోసం వారు నానా తంటాలు పడ్డారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచీ రాష్ట్ర పురోగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రైతులను ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు పక్కా ప్రణాళికలను రూపొందిస్తోంది.

# పామాయిల్ ప్రాభవానికి మసక?



దమ్మపేట : రాష్ట్రంలోనే పామాయిల్ హబ్గా పేరుగాంచిన అశ్వారా వుపేట ప్రాంతంలో క్రమం గా ఆ పంట ప్రాభవం మసక బారుతున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జన్యులోపంతో కూడిన మొక్కల పంపిణీ దగ్గర నుంచి మొదలుకొని.. దిగుబడుల తగ్గుదల, ధరల పతనం, ప్రభుత్వ పట్టింపు లేనితనం వంటివన్నీ తమ పాలిట శాపాలుగా మారుతున్నట్లుగా కన్పిస్తోందని పామాయిల్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండడం ఇందుకు బలం చేకూరుస్తోంది. పామాయిల్ సాగుకు పేరుగాంచి ఇప్పటివరకూ విరాజిల్లుతున్న ప్రాంతం అశ్వారావుపేట. రాష్ట్రం మొత్తంలో సాగవుతున్న 2.03 లక్షల ఎకరాల్లో సుమారు లక్ష ఎకరాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనివే. అందులోని అశ్వారావుపేట, దమ్మపేట పరిసర ప్రాంతాల్లోని నేలలు ఈ పంట సాగుకు యోగ్యంగా ఉండడం, స్థానికంగానే పరిశ్రమలు ఉండడం ఇక్కడి రైతులకు కలిసొచ్చే అంశం. అన్ని పంటలనూ తోసిరాజని గణనీయస్థాయిలో ఈ ప్రాంతంలో ఈ పంట సాగవుతోంది. దమ్మపేట మండలంలో మొత్తం 51 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంటే.. 35 వేల ఎకరాల్లోనూ, అశ్వారావుపేట మండలంలో 21 వేల ఎకరాల్లోనూ ఈ పంట సాగవుతోంది. ఈ పంటకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వాలు ఈ పంటను సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాయి. దేశ అవసరాల రీత్యా గణనీయస్థాయిలో కేంద్రంలో వివిధ దేశాల నుంచి పామాయిల్ను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ.. రాష్ట్రం నుంచి సుమారు రూ.600 కోట్ల విలువైన పామాయిల్ను ఉత్పత్తి చేసి కేంద్రానికి అందిస్తున్న ఘనత ఇక్కడి పామాయిల్ రైతులది. పామాయిల్ సాగు ఎంతవేగంగా విస్తరిస్తుందో అంతే వేగంతో చీడపీడల బెడద కూడా పెరుగుతోంది. ఇంతుకుముందు వరకు ఎకరాకు సగటున 10-12 మెట్రిక్ టన్నుల మధ్య వచ్చే దిగుబడి.. ఇప్పుడు 5-7 మెట్రిక్ టన్నులకు పడిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు 2022 జూన్లో రూ.23,467 ఉన్న పామాయిల్ గెలల ధర 2024 నాటికి రూ.13,705కు పడిపోవడం రైతులను దెబ్బతీస్తోంది. పైగా పెరుగుతున్న సాగు ఖర్చులను.. ప్రస్తుత దిగుబడులను బేరీజు వేసినప్పుడు తాము మరింత నష్టాల్లోకి కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండడం గమనార్హం. కానీ.. ఇటీవల పామాయిల్ దిగుబడులు గణనీయంగా తగ్గాయి. వాతావ రణ ప్రతికూల పరిస్థితులు, తెల్ల దోమలు వంటివి కారణాలని ఆయిల్ఫెడ్ అధికారులు చెబుతున్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు వచ్చి కనీసం తమ పంటలను కూడా పరిశీలించడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా పంటకు తెల్లదోమ, గానోడర్మా, స్టమ్ రాట్, రైనోసార్ బీటల్(రెడ్ ఫామ్ ఈవిల్), సంచి పురుగు(బ్యాగ్ వార్మ్)లు ఆశిస్తుండడం. సరఫరా చేయకపోవడం వంటివి కూడా దిగుబడుల తగ్గుదలకు కారణంగా ఉన్నాయి. అయితే, విదేశాల నుంచి తెచ్చి ఇక్కడి రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన మొక్కల్లో అత్యధి కంగా హాఫ్ టైప్(జన్యు లోపాలతో కూడిన) మొక్కలు కన్పిస్తున్నాయి. చెట్లు పెరిగి పంట దశకు చేరుకుంటున్న సమయంలో అవి జన్యు లోపంతో చనిపోతుడడంతో రైతులు లబోదిబో మంటున్నారు.

## బి సి రిజర్వేషన్ పెంచాలి

మెట్ పల్లి: మెట్ పల్లి పట్టణ బీసీ సంఘం ఆధ్వర్యంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కార్యదర్శి బొమ్మెనశంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు నెలలలో సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్ను 27% నుండి 42 % వరకు పెంచుతామని హామీ ఇచ్చారని, ఇంతవరకు బీసీ లెక్కలు తీయకపోవడం బాధాకరమని విచారాన్ని వ్యక్తం చేశారు.

# యోగికి చెక్ పెడతారా..



లక్నో, : యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్కు చెక్ పడేలా బీజేపీలో అడుగులు పడుతున్నాయా? పార్టీలో? యూపీ ప్రభుత్వంలో యోగికి కంట్లో నలుసులా తయారైన డిప్యూటీ సీఎం కేపీ మౌర్యకు బీజేపీ అధ్యక్షుడిని చేయడం ద్వారా? యోగి హవాకు బ్రేక్ వేయాలని పార్టీలో మరో వర్గం ప్రయత్నిస్తోందా? పార్లమెంట్ ఎన్నికల్లో సగం సీట్లు కోల్పోవడం? యోగి ప్రత్యర్థులు ఆయుధంగా మార్చుకున్నారనే టాక్ వినిపిస్తోంది. యోగి హవాకు బ్రేక్ వేయడానికి ఇదే తగిన సమయంగా భావిస్తున్న ఆయన ప్రత్యర్థులు చురుగ్గా పావులు కదుపుతున్నారటబీజేపీ జాతీయ రాజకీయాలు హీట్పుట్టిస్తున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమించవచ్చని ప్రచారం జరుగుతోంది. పార్టీ భావి నేతగా భావిస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్కు చెక్ చెప్పడానికే మౌర్యను తెరపైకి తెస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఐతే మౌర్య యూపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే 2017లో ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్న కారణం చూపి? మౌర్యను జాతీయు అధ్యక్షుడిగా చేయాలని ప్రతిపాదన తెరపైకి తెస్తున్నారు.వెనుకబడిన వర్గాలకు చెందిన మౌర్యను జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చేస్తే.. బీసీలను తమ వైపునకు తిప్పుకునేందుకు ఉపయోగపడుతుందని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడైన మౌర్యను 2017లోనే యూపీ ముఖ్యమంత్రిగా నియమించాలనుకున్నప్పటికీ.. యోగీ ఆదిత్యానాథ్ రంగంలోకి దిగడంతో అది సాధ్యం కాలేదు. మౌర్యకూ యోగికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్నట్లు విభేదాలున్నాయని, యోగి ప్రతి కదలికనూ ఆయన ఢిల్లీకి చేరవేస్తారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.గత లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ పలు సీట్లు కోల్పోవడంపై యోగిని జవాబుదారీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే, ఈ ఓటమితో తనకు సంబంధం లేదని, తనను సంప్రదించకుండా అభ్యర్థులను ఎంపిక చేశారని యోగి అన్నట్లు సమాచారం. త్వరలో యూపీలో పది అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలు యోగి భవిష్యత్తును నిర్ణయించవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ఉప ఎన్నికలకు ముందే బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమిస్తారా..? లేదా..? అన్నదానిపై స్పష్టత లేదు.మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మౌర్యనే జాతీయ అధ్యక్షుడిగా నియమించడం ద్వారా యోగిని ఇరకాటంలో పెట్టాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇటీవల బీజేపీ పెద్దలను కలిసిన మౌర్య? పార్టీ కంటే ఎవరూ గొప్పవారు కాదన్న వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. యూపీ సీఎం యోగిని దృష్టిలో పెట్టుకునే ఆయనీ వ్యాఖ్యలు చేశారంటున్నారు. మొత్తానికి యోగి ఆధిపత్యానికి చెక్ చెప్పేలా అడుగులు పడుతున్నాయంటున్నారు.

# ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు..

ఇల్లందు : జిల్లాలో వున్న ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఇవాళ స్థానిక ప్రభుత్వ వైద్య శాలను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాల పరిసరాలను, రోగులకు అందుతున్న వైద్యం, వైద్యశాలలో వున్న పరికరాలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%ొ% ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు అవసరమైన అన్ని పరికరాలను నెల రోజుల్లో సమకూరుస్తామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. వర్షాకాలం కావడం వల్ల వివిధ వ్యాధులు సోకి ప్రజలు ఇబ్బందులు పడతారని, వారికి వైద్య సిబ్బంది అన్నివేళల్లో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని వ్యాధుల పరీక్షలు అందుబాటులో ఉంచుతామని, ప్రజలు ప్రవేట్ వైద్యశాలలను ఆశ్రయించకుండా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం



చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్ష వర్ధన్, పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది, మునిసిపల్ చైర్మన్ డీ వి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com